క్లుప్తంగా

కాశిబుగ్గ స్వధార్ హోంలో మూగ యువతి



కాశిబుగ్గ: కాశిబుగ్గలోని స్వధార్ హోంలో ఓ మూగ యువతి ఆశ్రయం పొందుతోందని, ఆమె వివరాలు తెలిసిన వారు తమను సంప్రదించాలని హోం కౌన్సిలర్ కె.స్వాతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని రోజుల క్రితం సంగెం మండలం కాపుల కనపర్తిలో తిరుగుతుండగా స్థానికుల సమాచారం మేరకు సఖి సెంటర్ వారు ఆమెను ఈనెల 5న కాశిబుగ్గ స్వధార్ హోంలో చేర్పించారని పేర్కొన్నారు. వివరాలకు 90599 04864, 97049 09238 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

రేపు కేయూలో కాన్ఫరెన్స్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఫిజిక్స్ విభాగంలో డిపార్టుమెంటల్ కాన్ఫరెన్స్‌ను ఈనెల 23న ఉదయం నిర్వహించనున్నట్లు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, పీజీకి సంబంధించిన ఫిజిక్స్ సిలబస్, క్వశ్చన్ పేపర్ విధానం, పరీక్షల విధానం, ప్రయోగ తరగతుల నిర్వహణ విధానం, ఇతర అకడమిక్ అంశాలపై కాన్ఫరెన్స్‌లో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. అన్ని కళాశాలల ఫిజిక్స్ విభాగాల అధిపతులు హాజరు కావాలని కళాశాలల ప్రిన్సిపాళ్లకు ఉత్తర్వులు జారీచేశారు.

వాహన తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కాజీపేట: కాజీపేట చౌరస్తాలో శనివారం రాత్రి పోలీసులు ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సరైన కాగితాలు లేకుండా రోడ్లపై తిరుగుతున్న పలు వాహనాలను స్వాధీనం చేసుకుని నలుగురిపై చీటింగ్ కేసులు నమోదు చేశారు. ఏసీపీ పి.శ్రీనివాస్ పర్యవేక్షణలో నిర్వహించిన తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి, ఎస్సైలు మాచర్ల శ్వేత, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం

వరంగల్ అర్బన్: అన్నపూర్ణ సేవాదళ్ ఆధ్వర్యంలో శనివారం అన్నదానం చేశారు. అమావాస్యను పురస్కరించుకుని వరంగల్ బల్దియా ప్రధాన కార్యాలయానికి సమీపంలో బల్దియా ఉద్యోగులు, దేశాయిపేట వాకర్స్ సభ్యులు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అన్నపూర్ణ సేవాదళ్ ఆధ్వర్యంలో ప్రతినెల అమావాస్య రోజున అన్నదానం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బల్దియా ఉద్యోగులు, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం



కాజీపేట: టైలర్ షాపునకు వెళ్లిన వివాహిత కనిపించకుండా వెళ్లిన సంఘటనపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు. కాజీపేట పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దర్గా కాజీపేట శివారులోని గాంధీనగర్ కాలనీకి చెందిన తాళ్ల మౌనిక (28) వన్ షాపింగ్ మాల్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తోంది. శుక్రవారం టైలర్ షాపునకు వెళ్లి వస్తానంటూ ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో ఆమె భర్త శనివారం సాయంత్రం కాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సీఐ వివరించారు.

24న భక్త మార్కండేయ జయంతి

కాశిబుగ్గ: ఈనెల 24న నిర్వహించనున్న భక్త మార్కండేయ జయంతిని విజయవంతం చేయాలని వరల్డ్ పద్మశాలి క్లబ్ అధ్యక్షుడు రామా శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కాశిబుగ్గలోని రంగనాథస్వామి దేవాలయ ప్రాంగణంలో పద్మశాలి సంఘం సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కండేయ జయంతి సందర్భంగా ఓసిటీ నుంచి నిర్వహించనున్న మార్కండేయ శోభాయాత్రలో పద్మశాలి కులస్తులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో చిలుపూరి సురేష్, కూరపాటి సుదర్శన్, బాసాని చంద్రప్రకాష్, బేతి అశోక్, సాయన్న, గుండు చంద్రమౌళి, ప్రభాకర్, మల్లేశం, శ్రీనివాస్, రవీందర్, వెంకటేశ్వర్లు, సృజన, రోజా, కవిత పాల్గొన్నారు.

అధ్యాపకులపై నిర్లక్ష్యం తగదు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకులపై నిర్లక్ష్యం తగదని కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం (అకుట్) అధ్యక్షుడు ప్రొఫెసర్ శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మామిడాల ఇస్తారి అన్నారు. ఈమేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావును శనివారం కలిసి తమకు పదోన్నతులు కల్పించటంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని రిజిస్ట్రార్‌ను ప్రశ్నించారు. కార్యక్రమంలో అకుట్ బాధ్యులు ప్రొఫెసర్ సదానందం, డాక్టర్ నాగరాజు, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సోమయ్య, డాక్టర్ భారవిశర్మ, డాక్టర్ శాయోదా పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

కరీమాబాద్: ప్రభుత్వ భూములను పరిరక్షించాలని ప్రజలు కోరారు. 3వ డివిజన్ పరిధిలోని శ్రీరాఘవేంద్ర ఆర్టీసీ కాలనీలో ఉన్న భూమి కబ్జాకు గురికాకుండా చూడాలని కాలనీవాసులు కోరారు. ఈమేరకు వరంగల్ కలెక్టర్ గోపి, మున్సిపల్ కమిషనర్ ప్రావీణ్యకు శనివారం వినతిపత్రాలు అందజేశారు. కాలనీలోని 1243, 262, 263 సర్వేనంబర్లలో ఉన్న భూమిని సహకార సొసైటీ ద్వారా అక్కడ కమ్యూనిటీ హాల్, శిశుమందిర్ కోసం కేటాయించి మిగిలిన స్థలాన్ని 83 ప్లాట్లుగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అప్పటి నుంచి ఇప్పటిదాకా వాటి సంఖ్య 150కి చేరగా కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నించడంతో కాలనీవాసులు అడ్డుకున్నట్లు తెలిపారు. ఇంటి నిర్మాణం కోసం వారు దరఖాస్తు చేసుకోగా, మున్సిపల్ అధికారులు విచారణకు వచ్చినప్పుడు కూడా ఆ భూమి.. కమ్యూనిటీ హాల్, శిశుమందిర్‌కు కేటాయించనున్నట్లు చెప్పడంతో దరఖాస్తును తిరస్కరించగా మళ్లీ ఇప్పుడు నకిలీ పత్రాలను సృష్టించి దరఖాస్తు చేసుకున్నట్లు తెలియడంతో ఎమ్మెల్యే అరూరి రమేష్ దృష్టికి తీసుకుపోవడమే కాకుండా మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా ఈనెల 11న కాలనీ కమిటీ సమావేశంలో కూడా అక్కడ దేవాలయం, కమ్యూనిటీహాల్ నిర్మించేందుకు తీర్మానం చేసుకుని తాత్కాలికంగా షెడ్లు వేస్తే స్తంభాలు విరగ్గొట్టారని తెలిపారు. భూమిని కబ్జా చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ కమిటీ అధ్యక్షుడు పిన్నింటి ప్రకాశ్‌రావు, కార్యదర్శి కుమారస్వామి, సభ్యులు గణపతిరావు, రాయబారపు రాములు, చిరంజీవి, మహేందర్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు



గోకుల్‌నగర్‌లో నిరసన తెలుపుతున్న స్థానికులు

పార్కు ఏర్పాటు చేసే వరకు పోరాటం

హన్మకొండ: హనుమకొండ గోకుల్‌నగర్ కాకతీయ సహకార శిక్షణ కళాశాల (కేసీటీసీ)కు కేటాయించిన స్థలంలో పార్కు నిర్మించాలని గోకుల్‌నగర్‌తో పాటు చుట్టుపక్కల కాలనీవాసులు డిమాండ్ చేశారు. గతంలో పార్కు ఏర్పాటు చేస్తామని చెప్పిన పాలకులు.. మాట మార్చి కాకతీయ సహకార శిక్షణ కళాశాలకు ఆ స్థలాన్ని కేటాయించడంపై గోకుల్‌నగర్, చుట్టు పక్కల కాలనీవాసులు శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మహిళా విభాగం హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ యాదవ్, స్థానికులు మాట్లాడుతూ గోకుల్‌నగర్‌లో అంబేడ్కర్ భవన్, ఎఫ్‌సీఐ గోదాంల వెనుక వైపు ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలంలో పార్కు, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, కార్పొరేటర్ నల్ల స్వరూపరాణికి వినతిపత్రాలు ఇచ్చిన క్రమంలో తమకు వారు స్పష్టమైన హామీ ఇచ్చారని కాలనీవాసులు గుర్తు చేశారు. కాగా, దానికి భిన్నంగా వడ్డెపల్లి రెవెన్యూ శివారు 184 సర్వే నంబర్‌లోని 10గుంటల ఆ స్థలాన్ని కాకతీయ సహకార శిక్షణ కళాశాలకు ప్రభుత్వం కేటాయించిందని వాపోయారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొమ్మూరి ధనలక్ష్మి, గుమ్మడి శ్రీదేవి, కర్ణాటి పార్వతమ్మ, స్థానికులు బంక సంపత్ యాదవ్, బొంగు రాజు యాదవ్. చందు, మాడిశెట్టి అరుణ, సిలువేరు సరిత, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాల పెంపు



కల్నల్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

హన్మకొండ: ఎన్‌సీసీతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవడుతాయని ఎన్‌సీసీ 8వ తెలంగాణ గర్ల్స్ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రాజేష్ కౌశిక్ అన్నారు. హనుమకొండ వడ్డెపల్లిలోని పింగిళి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్‌సీసీ గదిని కల్నల్ రాజేష్ కౌశిక్ శనివారం ప్రారంభించారు. ఎన్‌సీసీ కేడెట్లతో గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ ద్వారా విద్యార్థులకు వివిధ రకాల శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఫిజికల్ ఫిట్‌నెస్, వెపన్ ట్రెయినింగ్, మ్యాప్ రీడింగ్, నేషనల్ ఇంటిగ్రేషన్ పాటు మంచి నడవడిక కలిగిన పౌరులుగా తీర్చిదిద్దడంతో పాటు దేశభక్తి కలిగిన కేడెట్లను దేశానికి అందించనున్నట్లు వివరించారు. అనంతరం రాజేష్ కౌశిక్‌ను అధ్యాపకులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బత్తిని చంద్రమౌళి, ఎన్‌సీసీ కేర్‌టేకర్ డాక్టర్ కల్పన, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసిని, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ రామకృష్ణారెడ్డి, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ పార్వతి, డాక్టర్ రేణుక, ఎన్‌సీసీ అధికారులు సుజితదేవి, అవంతి, ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.

26న రైతు వాహనాలతో నిరసన ప్రదర్శన



మాట్లాడుతున్న రాచర్ల బాలరాజు

వరంగల్ చౌరస్తా: ఈనెల 26న వరంగల్ జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ నుంచి నిర్వహించనున్న రైతు వాహనాల నిరసన ప్రదర్శనను జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు విజ్ఞప్తి చేశారు. వరంగల్ 27వ డివిజన్ అబ్బనికుంటలో శనివారం జరిగిన సమావేశంలో ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్, ఏఐకేఎంఎస్ జిల్లా బాధ్యుడు రాచర్ల బాలరాజు, రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్, ఏఐకేకేఎంఎస్ బాధ్యుడు వల్లందాస్ కుమార్ మాట్లాడారు. గత సంవత్సరం జనవరి 26న శాంతియుతంగా ఢిల్లీలో ట్రాక్టర్ ర్యాలీ నిర్వహిస్తున్న సందర్భంగా లాఠీచార్జ్, భాష్ప వాయువులు ప్రయోగించి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని గుర్తుచేశారు. ఈక్రమంలో రైతులు తమ కార్యాచరణను అమలు చేసి రైతు వ్యతిరేక నల్ల చట్టాలను రద్దు అయ్యేంతవరకు పోరాడారని, అది రైతు విజయం అని పేర్కొన్నారు. అయితే, కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన వాగ్దానాలు నేటికీ నెరవేరలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈక్రమంలో 26న వరంగల్ జిల్లా కేంద్రంలో రైల్వే స్టేషన్ నుంచి జరగనున్న వాహన ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వివిధ రైతు నాయకులు ఓదెల రాజన్న, ఐలయ్య, జగదీశ్వర్, ఎల్లయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భావ ప్రకటన హక్కు పరిరక్షణకు మానవహారం

నయీంనగర్: భావ ప్రకటన స్వేచ్ఛ హక్కును పరిరక్షించాలని హనుమకొండ కాళోజీ జంక్షన్‌లో సోమవారం మానవహారం ఏర్పాటు చేయనున్నట్లు హనుమకొండ, వరంగల్ జిల్లాల స్వేచ్ఛ జేఏసీ బాధ్యుడు ఎస్.తిరుపతయ్య తెలిపారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఇరు జిల్లాల జేఏసీ కార్యవర్గం సమావేశం శనివారం జరగగా ఆయన మాట్లాడారు. ఇటీవల హేతువాద, నాస్తిక, అంబేడ్కర్ వాదులపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. మూకదాడులకు దిగేవారి పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎంలు, వాటి ప్రజాసంఘాలతో పాటు, దళిత, బహుజన సంఘాలు, హేతువాద, నాస్తిక, వైజ్ఞానిక, హక్కుల సంఘాల నాయకులు పాల్గొననున్నట్లు తెలిపారు. సమావేశంలో రాజయ్య, పాణి, పరికిపండ్ల వేణు, రాజేందర్, రమాదేవి, దయాకర్ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేఏసీ నాయకులు

యువతికి ఆటో డ్రైవర్ల బెదిరింపులు

ఖిలా వరంగల్: ఇంజనీరింగ్ కళాశాలకు వెళ్లేందుకు రోడ్డుపై ఆటో కోసం ఎదురుచూస్తున్న ఓ యువతిని తన ఆటోలో ఎక్కాలంటే తన ఆటోలోనే ఎక్కాలంటూ ఇద్దరు ఆటో డ్రైవర్లు ఆ యువతిపై బెదిరింపులకు పాల్పడ్డారు. ఈక్రమంలో ఆ ఇద్దరు ఆటోడ్రైవర్లను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన శనివారం ఉదయం వరంగల్ శంభునిపేట జంక్షన్ సమీపంలో జరిగింది. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ తెలిపారు.

మహిళకు తీవ్ర గాయాలు

మడికొండ: ప్రమాదవశాత్తు కిందపడగా మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన కడిపికొండ శివారు రాజీవ్ గృహకల్ప సముదాయంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రాజీవ్ గృహకల్పలో నివాసముంటున్న స్వరూప.. బాపూజీనగర్‌లోని కూరగాయాల మార్కెట్‌లో కూరగాయలను అమ్ముకుని తిరిగి శనివారం సాయంత్రం నడుచుకుంటూ రాజీవ్ గృహకల్పకు వస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడిపోయింది. దాంతో తలకు గాయాలు కాగా ఆమెను పోలీసులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

డివైడర్‌ను ఢీకొట్టిన డీసీఎం

ఖిలా వరంగల్: అతివేగంతో వెళ్తున్న డీసీఎం వాహనం.. డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్పగాయాలతో క్షేమంగా బయటపడ్డాడు. ఈఘటనలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం వరంగల్ ఫోర్టురోడ్డు మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ సమీపంలో నగరానికి చెందిన డీసీఎం వాహనం రాత్రి అదుపు తప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది.

రైల్వే ఇనిస్టిట్యూట్‌లో కల్చరల్ కాంటెస్ట్

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ఇనిస్టిట్యూట్ ప్రాంగణంలో ఇన్‌స్టిట్యూట్ కమిటీ ఆధ్వర్యంలో కల్చరల్ కాంటెస్ట్ పోటీలను శనివారం నిర్వహించారు. రైల్వే ఆస్పత్రి సీనియర్ ఎంఎస్ డాక్టర్ ఐ.నిరంజన్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈమేరకు కూచిపుడి, భరతనాట్యం, ఫోక్ డ్యాన్స్, పేరిణి నృత్యాలు జరిగాయి. ఈ సందర్భంగా డాక్టర్ నిరంజన్‌రావు మాట్లాడుతూ రైల్వే ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో కల్చరల్ కాంటెస్ట్ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో రైల్వే ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, జాయింట్ సెక్రటరీ ఎం.రాజయ్య, ట్రెజరర్ జి.రాజేశ్వర్‌రావు, సభ్యులు రఘు, ఎస్.ప్రవీణ్, ప్రశాంత్, బి.మాధవరావు, పి.రవికిరణ్ పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న నిరంజన్‌రావు

సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ ఖోఖో పోటీలకు విద్యార్థి



రమ్యను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

హన్మకొండ: సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ పోటీల్లో పాల్గొనే కాకతీయ యూనివర్సిటీ మహిళా ఖోఖో జట్టుకు పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో బీకాం ప్రథమ సంవత్సర విద్యార్థిని ఎస్.రమ్య ఎంపికయ్యారు. ఈమేరకు హనుమకొండ వడ్డెపల్లిలోని కళాశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో రమ్యను ప్రిన్సిపాల్ బత్తిని చంద్రమౌళి, అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి.సుహాసిని, అధ్యాపకులు డాక్టర్ డి.రామకృష్ణారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ జె.అశోక్ రెడ్డి, కళాశాల గేమ్స్ కమిటీ సభ్యులు డాక్టర్ డి.పార్వతి, డాక్టర్ రేణుక, సిహెచ్ స్నేహలతారెడ్డి, భాస్కర్, జగదీష్ పాల్గొన్నారు.

'కార్పొరేటర్ అరెస్టుపై కాంగ్రెస్ సంబరాలు'

హన్మకొండ చౌరస్తా: భూకబ్జాకు పాల్పడిన కేసులో 7వ డివిజన్ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపడంపై యూత్ కాంగ్రెస్ నాయకులు హనుమకొండ చౌరస్తాలో శనివారం బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు తోట పవన్ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే అండదండలతో ప్రజలను రాబందుల్లా పీక్కుతింటూ బయటకు రాని కబ్జాకోరులు ఇంకా చాలామంది ఉన్నారని అన్నారు. వారందరిని బయటికి లాగి జైలుకు పంపాలని పోలీసులను కోరారు. కార్యక్రమంలో అలువాల కార్తీక్, మాడిశెట్టి సతీష్, కొల్లూరి సాయిరాజ్, చందు, కొత్తపల్లి శివ, రాహుల్, వెంకట్ పాల్గొన్నారు.



బాణసంచా కాల్చుతున్న కాంగ్రెస్ నాయకులు

బీసీ కులగణన చేపట్టాలి

వరంగల్: బిహార్‌లో కులగణన రద్దు కోసం వేసిన వ్యాజ్యాలను సుప్రీంకోర్టు కొట్టివేయడం హర్షణీయమని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టాలని సూచించారు. నగరంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ కులగణన చేపడితే ఆయా కులాల సామాజిక ఆర్థిక పరిస్థితులు వెల్లడవుతాయని అన్నారు. దాంతో ఆయా కులాల జనాభా ప్రాతిపదికన రాష్ట్ర బడ్జెట్లో నిధులు కేటాయించి, వారి సమగ్ర అభివృద్ధికి చర్యలు చేపట్టవచ్చని సూచించారు. కేంద్ర ప్రభుత్వం కుంటి సాకులు చెప్పకుండా తక్షణమే దేశవ్యాప్తంగా జనాభా లెక్కల సేకరణలో బీసీ కులగణన చేర్చాలని కోరారు.

కాజీపేట: రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలో శనివారం నిర్వహించిన సంఘం విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 144 బీసీ కులాలున్నాయని వివరించారు. వారందరికి విద్య, సామాజిక, ఉద్యోగ రంగాల్లో ప్రాధాన్యం దక్కాలంటే పక్కాగా లెక్క ఉండాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకుని బీసీ గణన చేయాలని కోరారు. సమావేశంలో మూల రాజు, బుర్ర రాజేందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న భిక్షపతి

మడికొండ: పేదరిక నిర్మూలనకు ప్రజలు ప్రజా ఉద్యమాలను నిర్మించాలని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి పిలుపునిచ్చారు. కాజీపేట మండల సీపీఐ సమితి సమావేశాన్ని మడికొండలోని ఆర్‌ఎస్‌ఆర్ కాలనీలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం, ఇళ్ల స్థలాలు, కూడు అందక, ఉపాధి అవకాశాలు లేక దారిద్ర్యరేఖకు దిగువన దేశవ్యాప్తంగా 40శాతం మంది పేదరికంలో మగ్గుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలను అమలు చేయడంలో పాలకులు పూర్తిగా వైఫల్యం చెందారని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, మండల కార్యదర్శి మునిగాల భిక్షపతి, నాయకులు మాలోతు శంకర్, రాసమల్ల దీన, జ్యోతి, అనసూయ, రాజేశ్వరి, మణెమ్మ పాల్గొన్నారు.

గృహ నిర్మాణ సంస్థ రద్దు అన్యాయం

హన్మకొండ: గృహ నిర్మాణ సంస్థను, గృహ నిర్మాణ మండలిని రద్దు చేసి రహదారుల భవనాల శాఖలో విలీనం చేయడం అన్యాయమని ప్రజా వేదిక రాష్ట్ర చైర్మన్ తిరునహరి శేషు అన్నారు. హనుమకొండ సుబేదారిలో ప్రజావేదిక జిల్లా కమిటీ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణ సంస్థను రద్దు చేసి పేదల సొంతింటి కలపై ప్రభుత్వం నీళ్లు చల్లిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన డబుల్ బెడ్రూం ఇళ్ల పథకం జవాబుదారీతనం లేక నత్తనడకన సాగుతోందని విమర్శించారు. కొత్త పార్లమెంట్ భవనం, కొత్త సచివాలయాన్ని నిర్మించుకుంటున్న ప్రభుత్వాలకు.. సొంతిళ్లు లేని పేదలకు ఇళ్ల నిర్మాణం చేపట్టాలనే చిత్తశుద్ధి లేకపోవడం శోచనీయమని అన్నారు. పేద ప్రజల ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచటానికి గతంలో ఉన్న ప్రత్యేక మంత్రిత్వ శాఖను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా వేదిక జిల్లా అధ్యక్షుడు దారబోయిన సతీష్, నాయకులు చిన్నాల యశ్వంత్ యాదవ్, రాము పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తిరునహరి శేషు

పట్టుదలతో కృషి చేస్తే విజయం

కాజీపేట అర్బన్: విద్యార్థులు లక్ష్య సాధనకు పట్టుదలతో కృషి చేయాలని మైనార్టీ గురుకుల పాఠశాలల కార్యదర్శి షఫియుల్లా సూచించారు. కాజీపేట మండలం కడిపికొండలోని మైనార్టీ గురుకుల పాఠశాలను షఫిఉల్లా శనివారం సందర్శించి, పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమాధికారులు మేన శ్రీను, విక్రమ్, రీజినల్ కోఆర్డినేటర్ శ్రీపాల, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న షఫియుల్లా

సంక్షిప్తంగా

బదిలీలకు అవకాశం కల్పించాలి

విద్యారణ్యపురి: ప్రభుత్వం చేపట్టబోతున్న ఉపాధ్యాయుల బదిలీల సందర్భంగా తొలుత 317 జీఓకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని, జీరో సర్వీస్ ఉన్న ఉపాధ్యాయులకు కూడా బదిలీలకు అవకాశం కల్పించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆముదాల దాత మహర్షి, జనరల్ సెక్రటరీ బత్తిని వీరస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌ఎంలు ఒకేచోట ఐదేళ్ల సర్వీస్ పూర్తయితే తప్పనిసరిగా బదిలీలు చేపట్టాలని వారు పేర్కొన్నారు.

మల్లికా సారాభాయ్‌కి సన్మానం

హన్మకొండ: హనుమకొండలో జరిగిన రామప్ప ఉత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన ప్రముఖ నృత్యకారిణి, పద్మభూషణ్ అవార్డు గ్రహీత మల్లికా సారాభాయ్‌ను హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో శనివారం వరంగల్ కాకతీయ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెరుకారి శ్రీధర్, సభ్యులు సన్మానించారు. కార్యక్రమలో వరంగల్ కాకతీయ వాకర్స్ అధ్యక్షుడు పెరుకారి శ్రీధర్, నిమ్మల శ్రీనివాస్, రామానంద్, విష్ణు, ఆచార్య, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

కిట్స్‌లో 'టాలెంట్ హంట్'

హసన్‌పర్తి: కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం 'టాలెంట్ హంట్' పేరుతో (ఫ్రెషర్స్ డే) వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఫ్రెషర్స్‌డేతో స్నేహబంధం పెంపొందుతోందని అన్నారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

జీకేలో బ్రెయిన్‌స్టార్స్ విద్యార్థి ప్రతిభ

హన్మకొండ చౌరస్తా: ఈనెల 20న అక్షర నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జనరల్ నాలెడ్జ్ పోటీల్లో హనుమకొండ రాయపురలోని బ్రెయినీ స్టార్స్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థి ప్రతిభ కనబరిచింది. ఈమేరకు ట్రస్మా అధ్యక్షుడు యాదగిరి, డైరెక్టర్ ఎంఎస్.రాజు నుంచి అవార్డును సారా అందుకుంది.

కళాకారిణికి అభినందన

దేశాయిపేట: ఆంధ్రప్రదేశ్ చిలకలూరిపేట కళానిలయం ఆధ్వర్యంలో ఈనెల 6, 7, 8 తేదీల్లో నిర్వహించిన 38వ జాతీయ స్థాయి శాస్త్రీయ నృత్య పోటీల్లో వరంగల్ శాంతినగర్‌లోని ఎస్‌ఆర్ హైస్కూల్ (ప్రతిభ) విద్యార్థిని టి.హాసిని.. కూచిపూడి విభాగంలో ప్రథమ, జానపద విభాగంలో స్పెషల్ జ్యూరీ బహుమతి గెలుచుకుంది.

కృష్ణమూర్తికి బంగారు పతకం

కాజీపేట: తెలంగాణ రాష్ట్ర 9వ మాస్టర్స్ అథ్లెటిక్స్ రాష్ట్ర చాంపియన్‌షిప్ పోటీల్లో కాజీపేట పట్టణానికి చెందిన మండలోజు కృష్ణమూర్తి బంగారు పతకం దక్కించుకున్నారు. మెదక్ జిల్లా ఇందిరాగాంధీ స్టేడియంలో జరుగుతున్న పోటీల్లో 65 సంవత్సరాల విభాగం షార్ట్‌పుట్‌లో రాణించి పతకాన్ని ఎస్సీ శ్వేత చేతుల మీదుగా శనివారం అందుకున్నారు.

రాజ్‌మోహన్‌కు చిమ్మీ భూషణ పురస్కారం

కాజీపేట: కొన్నేళ్లుగా తెలుగు సాహిత్య రంగంలో చేస్తున్న విశేష కృషికి చైతన్యపురి కాలనీకి చెందిన శనిగరపు రాజ్‌మోహన్.. చిమ్మీ భూషణ పురస్కారం –2023కి ఎంపికయ్యారు. ఈమేరకు శ్రీహంస వాహిని సాహిత్య కళా పీఠం బైంసా ఆధ్వర్యంలో సంస్థ ప్రధాన కార్యదర్శి పీసర శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

ఆర్‌యూపీపీ టీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

కాళోజీ సెంటర్: రాష్ట్ర ఉపాధ్యాయ పండిట్ పరిషత్ (ఆర్‌యూపీపీ టీఎస్) వరంగల్ జిల్లా క్యాలెండర్, టేబుల్ క్యాలెండర్లను డీఈఓ వాసంతి శనివారం ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొండ యాదగిరి, జిల్లా అధ్యక్షుడు కక్కెర్ల రమేష్, ప్రధాన కార్యదర్శి పోతుల మురళీధర్, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆకుల అశోక్, జయరామరాజు, వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు లింగమూర్తి, మహిళా ప్రతినిధి బాలనిర్మల, ఇందిర, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఉన్నారు.

ఆరోగ్యశ్రీ ద్వారా 133 రకాల వైద్య సేవలు

హసనపర్తి: ఆరెపల్లి శివారులోని ప్రతిమ రిలీఫ్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా 133 రకాల వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ ధీరజ్ తెలిపారు. ఆస్పత్రిలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని ఎంజీఎం ఆస్పత్రిలో ఎన్ని రకాల సేవలు అందుబాటులో ఉన్నాయో.. ఆ సేవలన్నీ ప్రతిమ రిలీఫ్ ఆస్పత్రిలో అందజేస్తున్నట్లు చెప్పారు. 330 పడకలు ఆస్పత్రిలో అందుబాటు ఉన్నాయన్నారు.

కిడ్నాపర్లకు దేహశుద్ధి

హసన్‌పర్తి: పిల్లలను కిడ్నాప్ చేసే ముఠాకు స్థానికులు దేహశుద్ధి చేసి, అనంతరం వారిని పోలీసులు అప్పగించారు. ముఠాలో నలుగురు సభ్యుల్లో ఇద్దరు పరారీలో ఉండగా, మరో ఇద్దరు పోలీసు కస్టడీలో ఉన్నారు. 65వ డివిజన్ ఆహల్య తండాలో నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా శనివారం తచ్చాడుతూ, చిన్నారులను కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించారు. ఇది గమనించిన స్థానికులు వారిలో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. కాగా, అదుపులో ఉన్నవారు సరైన సమాధానం ఇవ్వడం లేదని కాకతీయ యూనివర్సిటీ ఎస్సై సతీష్ చెప్పారు.

ట్రోల్‌ఫ్రీ నంబర్ పేరిట మోసం

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీకి చెందిన రాపాక నరేందర్‌రెడ్డి.. తన కోటక్ మహేంద్ర బ్యాంక్ ఖాతాకు పేటీఎం యాప్‌ను లింక్ చేసుకోవటానికి ఓ టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేశారు. ఈక్రమంలో సైబర్ నేరగాడు పంపిన లింక్‌ను క్లిక్ చేయడంతో అతని ఖాతా నుంచి రూ.33,999 డబ్బు మాయమైనట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ షూకుర్ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

వరంగల్: నగరంలోని ఏనుమాముల సుందరయ్య నగర్‌లోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 27మంది విద్యార్థులకు సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు జూపాక రత్నప్రణయ్ మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కాగా, స్టడీ మెటీయల్ పంపిణీ చేసిన సంస్థ సభ్యులను హెచ్‌ఎం వెంకటేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి ఉషాభాస్కర్, ఆనందం, ప్రదీప్, నాగరాజారెడ్డి, సందీప్, నరేష్ పాల్గొన్నారు.